క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెమలి/కొణిజెర్ల(గంపలగూడెం): మండలంలోని ఊటుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నాలుగు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీష్ సోమవారం తెలిపారు. కొణిజెర్ల, నెమలి, ఉమ్మడదేవరపల్లి, దుందిరాలపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ నూతన లైన్లు ఏర్పాటు, పాతలైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఆపివేస్తున్నట్లు ఏఈ వివరించారు.

● చాట్రాయి: మండలంలోని జనార్ధనవరం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. జనార్ధనవరం, ఆరుగొలనుపేట గ్రామాల్లోని గృహాలు, కోళ్ల ఫారాలకు మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ఉండాలి



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని డీసీపీ (ట్రాఫిక్) చక్రవర్తి అన్నారు. కేతనకొండ శ్రీస్వామి నారాయణ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థి సంఘాల ఎన్నికల్లో గెలిచిన వారికి బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. డీసీపీ మాట్లాడుతూ తనను నమ్ముకున్న వారిని, తన వెనుక ఉన్న వారిని సన్మార్గంలో నడిపేవాడే సరైన నాయకుడు అన్నారు. నైతిక విలువలతో సామాజిక సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. మంత్ర స్వరూప్ స్వామీజీదాస్, డైరెక్టర్ దినేష్ కుమార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

జి.కొండూరు: మండల పరిధి కుంటముక్కల గ్రామానికి చెందిన కాకర్ల లక్ష్మేశ్వరరావు, నాగరత్తమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, జామెట్రీబాక్సులను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం షరీఫ్ మాట్లాడుతూ 130 మంది విద్యార్థులకు ఈ విద్యోపకరణాలను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దాతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రోజూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ధనచక్ర బ్యాంక్ మేనేజర్ గుడిపాటి హరికృష్ణ అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు వారాలుగా నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యోగా ఒక ప్రాచీన సంప్రదాయ ఆరోగ్య వరప్రదాయని అన్నారు. యోగా ఆచరించి ఆరోగ్యం పొందాలన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవడుతుందన్నారు. అనంతరం యోగా గురువు జనార్దన్‌ను పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం కొండపల్లి ఐడీఏలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిపారు. జీవ ఇంధనం వినియోగంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆ సంస్థ డీజీఎం రమేష్‌బాబు మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా స్థిరమైన అభివృద్ధికి ఉపయోగపడేవి జీవ ఇంధనాలు అన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి జీవ ఇంధనాలు దోహదపడతాయన్నారు. ఈ ఇంధనం మొక్కలు, వ్యవసాయం, గృహాలు, పారిశ్రామిక వ్యర్థాల నుంచి ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఇథనాల్ అనేది పంటల అవశేషాల నుంచి తయారవుతుందని తెలిపారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపేయండి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు తక్షణమే నిలిపేయాలని కోరుతూ మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఎంఈవో సీహెచ్ పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సయ్యద్ ఖాశీం మాట్లాడుతూ వేలమంది ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడం విద్యావ్యవస్థలో డొల్లతనం బయటపడుతుందన్నారు. గత ప్రభుత్వ విధానాలే కూటమి ప్రభుత్వం కూడా అమలు పర్చుతున్నట్లు కనిపిస్తోందన్నారు. అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వం ముందుకెళ్తే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో మండల నాయకులు రెడ్‌స్టార్, నరేంద్ర, అమర్‌నాయక్, శ్రీనివాసరావు, ఆర్మ్‌స్ట్రాంగ్, కృష్ణారావు, కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీవో 53 ప్రకారం సర్దుబాటు చేయాలి

జి.కొండూరు: ఉపాధ్యాయుల సర్దుబాటులో 117జీఓని రద్దు చేసి, జీఓ నంబరు 53 ప్రకారం సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య కోరారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సిలింగ్‌ను బహిష్కరించిన ఉపాధ్యాయులు, తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ పీవీ నర్సింహారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో 117జీఓని రద్దు చేస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖామంత్రి నారా లోకేష్, అదే జీఓ ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాట్లను చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం వల్లన తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. 117జీఓ రద్దు చేసి జీఓ నంబరు 53 ద్వారా సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంపలగూడెం: టీచర్ల పని సర్దుబాబు ప్రక్రియను 2020లో విడుదల చేసిన 53 జీవో ప్రకారం నిర్వహించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) మండలశాఖ ఆధ్వర్యంలో ఎంఈవో పీవీడీఎల్ నరశింహారావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎంఆర్సీ వద్ద ఫ్యాప్టో నాయకులు ఎంఈవోను కలిశారు. పని సర్దుబాబు ప్రక్రియలో సీనియర్ టీచర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని, డివిజన్, మండల స్థాయి వరకే పనిసర్దుబాటు చేయాలని, 2025 ఏప్రిల్ లోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులను మినహాయించాలని తదితర 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో మండల శాఖ ప్రతినిధులు పోతురాజు ఏడుకొండలు, గొర్రాజు కోటేశ్వరరావు, వేల్పుల వెంకటేశ్వర్లు, కోట రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మండలంలోని ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు తాడి నరసింహారావు, యూటీఎఫ్ నాయకులు అజరయ్య మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అసంబద్ధ పనిసర్దుబాటును తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీహెచ్ సురేష్‌కుమార్, మక్కే వేణుగోపాలరావు, అంకం వెంకటేశ్వరరావు, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల విద్యా పనిసర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని, లేకపోతే పని సర్దుబాటు ప్రక్రియను బహిస్కరిస్తామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎల్.చంటి, తేజస్విని, సూర్య, శ్రీరాములు, రవీంద్రబాబు, సురేష్ బాబు, జార్జి వాషింగ్టన్ పాల్గొన్నారు.

మునునూరు: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని మండల ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు గాంగేయుడు, పద్మకిషోర్, కళాధర్, బాబూరావు, వెంకటేశ్వరరావు,ఫ్రాన్సిస్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



జి.కొండూరులో ఎంఈఓ నర్సింహారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు



ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు



గంపలగూడెంలో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు



అగిరిపల్లిలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఏ కొండూరు విద్యాశాఖ కార్యాలయంలో..



ముసునూరులో ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

16 నుంచి రెవెన్యూ సదస్సులు

జి.కొండూరు: మండల పరిధిలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలలో ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 24వ తేదీ వరకు రోజూ ఒక గ్రామ పంచాయతీలో సదస్సును నిర్వహిస్తామన్నారు. ప్రజల భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.

● మైలవరం: మండలంలో ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీటీ శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మొర్సుమల్లిలో 16న, చంద్రగూడెంలో 17న, మైలవరంలో 20న, 22న పొందుగల, 24న వెల్వడం, 27న తోలుకోడు, 29న కనిమెర్ల, 31న జంగాలపల్లి, సెప్టెంబర్ 3న పుల్లూరు, 5న వెదురుబీడెం, 10న ములకలపెంట, 12న దాసుళ్ళపాలెం, 17న సబ్జపాడు, 19న టి.గన్నవరం, 21న గణపవరం, 24న చంద్రాల, 26న కీర్తిరాయనిగూడెం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. తహసీల్దారు, రెవెన్యూ అధికారులు, పాల్గొంటారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మురళీమోహనరావు

చాట్రాయి: మండల పరిషత్ ఏవోగా పనిచేస్తున్న మురళీమోహనరావు ఇన్‌చార్జి ఎంపీడీవోగా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఎంపీడీవోగా పనిచేసిన మంగాకమారి టి నర్సాపురం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

నూజివీడు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల యువతకు అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుఖవ్యాధుల సుర‌క్ష కేంద్రం కౌన్సిలర్ జీ లత పేర్కొన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, ఇతర లైంగిక వ్యాధులపై అవగాహన పెంచేందుకు పట్టణంలోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సును రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైడ్స్ సంస్థ మేనేజర్ ఎం లక్ష్మి, సెయింట్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అమూల్య, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు అవకాశాలు మెండు

మైలవరం: నైపుణ్యం కలిగిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలలో మంచి అవకాశాలు ఉన్నాయని బెంగళూరు ఎంబెడెడ్ తారాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మాధవ్ పాండియన్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ, ఎంబెడెడ్ తారాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఎంబెడెడ్ ఐఓటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అనే అంశంపై వారం రోజుల పాటు జరిగే వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవ్ మాట్లాడుతూ ఎంబెడెడ్ ఐఓటీలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉత్తేజకరమైన కెరియర్ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉందని, దీనికి నైపుణ్యం ఉన్న ఇంజినీర్లు అవసరమన్నారు. సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయశాస్త్ర పితామహుడు రంగనాథన్..

మైలవరం: గ్రంథాలయశాస్త్ర పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ సేవలు ప్రశంసనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయంలో గ్రంథాలయశాస్త్ర పితామహుడు డాక్టర్ రంగనాథన్ 132వ జయంతి, గ్రంథాలయ దినోత్సవం సోమవారం నిర్వహించారు. గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, పౌర గ్రంథాలయ చట్టాలను ప్రవేశ పెట్టడంలో విశేష కృషి చేసిన వ్యక్తి రంగనాథన్ అని, ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాంకేతిక విద్యా కళాశాలలో డిజిటల్ వనరులు, ఈ-బుక్స్, ఈ-జర్నల్స్, ఈ-మ్యాగజైన్స్ అవసరాన్ని, వినియోగాన్ని వివరించారు. అకడమిక్ డీన్‌డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి, లైబ్రేరియన్ డాక్టర్ టీ సాంబశివరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

62 మందికి వైద్య పరీక్షలు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి వైద్యాధికారులు పీ శ్రీనివాస్ గౌతమ్, షేక్ నజ్మా ఆధ్వర్యంలో సోమవారం గొల్లపల్లిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే తినాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. ఈ శిబిరంలో 62 మందిని పరీక్షించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు గూండ్రు శ్రీనివాసరావు, పద్మావతి, ఏఎన్ఎం జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ ఏస్తేరు రాణి, హెల్త్ అసిస్టెంట్ ఆకుల దేవదాసు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల షెడ్యూల్..

మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించనున్న వైద్య శిబిరాలను వివరాలను వైద్యులు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 13న జంగంగూడెం, 14న దేవరగుంట, 16న మొర్సపూడి, 17న పోలసానపల్లి, 19న గొల్లపల్లి-1, 20న వేంపాడు, 21న గొల్లపల్లి బీసీ కాలనీ, 22న మీర్జాపురం, 23న మర్రిబంధం, 24న సీతారామపురం, 26న ఎంఎన్‌పాలెం, 27న పల్లెర్లమూడి, 28న రాట్నాలగూడెం, 29న శోభనాపురం, 30న కంద్రిక గొల్లగూడెంలలో వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు, ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డివిజన్ స్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నూజివీడు: బాల కార్మిక వ్యవస్థపై డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. వక్తృత్వ పోటీల్లో సీనియర్ విభాగంలో సీహెచ్ నిఖిల (10వ తరగతి), ఎం.శ్రీలాస్య (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో బీ లావణ్య ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యాసరచన పోటీల్లో సీనియర్ విభాగంలో ఎన్.కవిత (10వ తరగతి), కోటవారిగూడెం హైస్కూల్‌కు చెందిన ఎం.జమలమ్మ (10 తరగతి) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగంలో పీ ఈశ్వరి (7వ తరగతి), ఎస్. బాలమేఘన (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డ్రాయింగ్ జూనియర్ విభాగంలో ఎండీ ఫర్హానా, జీ దర్శిని (8వ తరగతి), సీనియర్ విభాగంలో ఏ మైథిలీ, ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌కు చెందిన ఎస్.వంశీకృష్ణ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

జాతీయ జెండా ప్రదర్శన

పెనుగొలను(గంపలగూడెం): కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసే విషయమై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మండలంలోని పెనుగొలనులో సోమవారం విద్యార్థులు జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక షిర్డీసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు మువ్వన్నెల జెండాలను చేతబూని గ్రామంలోని ప్రధాన వీధులవెంట ప్రదర్శన చేశారు. ఆగస్టు 15వ తేదీన ప్రతిఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని పాఠశాల హెచ్‌ఎం నరశింహారావు కోరారు. పెనుగొలను గ్రంథాయల నిర్వాహకురాలు జే శ్రీలత, సేవాసమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల బాధ్యత ఉపాధ్యాయులదే

డీవైఈఓ సేవియా

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌లో డీవైఈఓ ఎం.సేవియా నేతృత్వంలో సోమవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. సబ్జెక్టు టీచర్ల పని తీరును పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్‌లను తనిఖీ చేశారు. ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించిన అనంతరం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ పాఠశాలలు పిల్లల్ని దేశానికి ఉపయోగపడే పౌరులుగా తయారు చేసే గురుతరమైన బాధ్యతను పోషించాలన్నారు. సబ్జెక్టుల వారీగా, తరగతి వారీగా సామర్థ్యాలను విద్యార్థులు సాధించేలా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయులంటే నిరంతర అభ్యాసకులని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రతి ఉపాధ్యాయుడు ఎదగాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయుల బృందం వరప్రసాదరావు, షేక్ అస్లాం, రాంబాబు, నాగేంద్రరావు, నాగరాజు, ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

మైలవరం: కళాశాల యూనివర్శిటీలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కే కార్తీక్, ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్దవరపు వెంకట్రావు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నిరంతరం విద్యార్థి సమస్యలు, స్థానిక సంస్థలపై పోరాటాలు నిర్వహించిందన్నారు. కాలేజీ, విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించలేకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థతను తెలియజేస్తుందన్నారు. మైలవరం ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ ప్రతిపాదన, తాత్కాలిక కమిటీ కన్వీనర్‌గా తమ్మిశెట్టి శ్రీనివాసరావు, కోకన్వీనర్‌గా కే రేవంత్ కుమార్‌లను ఎన్నుకున్నారు. తొమ్మండ్రు సతీష్, కలపాల వేణు, నరేష్, విజయ్, జరబల రాజు తదితరులు పాల్గొన్నారు.

‘డ్రగ్స్ రహిత దేశం’ బాధ్యత విద్యార్థులదే

మైలవరం: భారతదేశాన్ని డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం నషా ముక్త్ భారత్ అభియాన్ (డ్రగ్స్ ఫ్రీ ఇండియా) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి, వాటిని ఎవరైనా వాడుతుంటే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వి. ఫణికుమార్, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ మన్నే స్వామి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై స్వామి సోమవారం తెలిపారు. మండలంలోని బూరుగుగూడెం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ 73,900 నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని ఆర్డీఓ వై.భవానీశంకరి అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 8 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపింపిస్తున్నామన్నారు. వాటిని జాప్యం చేయకుండా సకాలంలో అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని, దీంతో అర్జీ పరిష్కారమైందా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ నుంచి సీఎం వరకు ఎప్పుడైనా చూడొచ్చన్నారు. పరిష్కారానికి వీలవ్వకపోతే సంబంధిత కారణాన్ని చూపించాలన్నారు. డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ సుందరి, ఏడీఏ జీ విద్యాసాగర్, హెచ్ఓ ఆర్ హేమ తదితరులు పాల్గొన్నారు.



అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్ తనిఖీ

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌ను సోమవారం రాత్రి ఆర్డీఓ వై భవానీశంకరి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడంతో పాటు హాస్టల్‌లో ఉన్న సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. చదువును నిర్లక్ష్యం చేయొద్దన్నారు. హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



బాలుర హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీశంకరి

క్వారీ, క్రషర్ కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ డిమాండ్

ఇబ్రహీంపట్నం: క్వారీలు, స్టోన్ క్రషర్స్‌లో పని చేస్తున్న కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిటాల క్వారీలో ఇటీవల కాలంలో జరిగిన క్వారీ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మరణించిన ఘటన మరువక ముందే అదే స్టోన్ క్రషర్‌లో ప్రమాదానికి గురై రెండు కాళ్లు విరిగిపోయిన చికిత్స పొందుతున్న ఒరిస్సాకు చెందిన చిన్న కొమ్ముల గౌడ్ అనే కార్మికుడిని విజయవాడ ప్రైవేట్ వైద్యశాలలో సోమవారం ఆయన పరామర్శించారు. వరుస ప్రమాదాలతో కార్మికులు మృతి చెంది అంగవైకల్యం కలగడం బాధాకరమన్నారు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా క్రషర్ యాజమాన్యాలకు చీమకుట్టినట్లు లేదన్నారు. ప్రమాదాలపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించి సాధారన పరిస్థితులు వచ్చే వరకు ఆర్థిక సహాయంతో ఆదుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల్లో పైడిమర్రి పేరు ముద్రించాలి

తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు పేరును అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి రాంప్రదీప్ విజ్ఞప్తి చేశారు. ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి జీవితచరిత్రను ఆంగ్లభాషలో రచించిన రాంప్రదీప్ గతంలో చేసిన విజ్ఞప్తి మేరకు తెలుగు రాష్ట్రాల్లోని పాఠ్య పుస్తకాల్లో పైడిమర్రి పేరు ముద్రిస్తుండగా, దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పద్ధతి అనుసరించాలని కోరారు.

రైతు సంఘ సభ్యుల సేవలు అభినందనీయం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): ప్రేమధార రైతు ఉత్పత్తుల పరస్పర సహాయక సంఘం సేవలు అభినందనీయమని నాబార్డ్ రాష్ట్ర రీజనల్ కన్సల్‌టెంట్ బి.రాజకుమార్ అన్నారు. కొటికలపూడిలో రైతు ఉత్పత్తుల పరస్పర సహాయక సంఘం కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నాబార్డ్ పోర్టల్‌లో ఈ సంఘం ఏ గ్రేడ్‌లో ఉండటంపై సభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో నాప్ కిసాన్, నేషనల్ అగ్రికల్చరల్ ఇన్ఫ్రా ఫైనాన్స్ ఇండియా సంస్థ నుంచి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. సభ్యులు రాజ్‌కుమార్‌ను సత్కరించారు. వరల్డ్ విజన్ ఇండియా మేనేజర్ జోష్ బాబు, కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, సర్పంచి రెంటపల్లి నాగరాజు, సభ్యులు సమలయ్య, కోటయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు పొందాలి

ముసునూరు: పొలంబడి కార్యక్రమం ద్వారా వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ రైతులకు సూచించారు. సోమవారం చెక్కపల్లిలో పొలంబడి గ్రామసభలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్‌పీఓ అధ్యక్షుడు చిలుకూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ఏఈఓ రామకృష్ణ, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.